ఈత కొడదాం రండి


మురళీనగర్ స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న క్రీడాకారులు


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన చిన్నారి స్విమ్మర్లు

- మురళీనగర్‌లో ఆధునిక స్విమ్మింగ్ పూల్
- మహిళలకు ప్రత్యేకంగా కోచింగ్
- అతి తక్కువ ఫీజుతో అందరికీ అవకాశం

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కుకు అనుబంధంగా ఏర్పాటు చేసిన ఆధునిక స్విమ్మింగ్ పూల్ ఔత్సాహిక క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తోంది. నగరంలో ఇతర స్విమ్మింగ్ పూల్స్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా ఇది అందరికీ అందుబాటులో ఉండేలా నిర్వాహకులు తీర్చిదిద్దారు. పిల్లలు, పెద్దలు, మహిళలకు స్విమ్మింగ్ నేర్పేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ అందరి ఆదరణ పొందుతున్నారు.

ఇవీ నిబంధనలు

స్విమ్మింగ్ పూల్‌లో కోచింగ్ తీసుకోవాలంటే కనీసం 8 ఏళ్ల వయసు దాటి ఉండాలి. వారి చిరునామా వివరాలతో ఆధార్ కార్డు సమర్పించాల్సి ఉంటుంది. బ్యాచీకి గంట మాత్రమే సమయం కేటాయిస్తారు. ప్రతి బ్యాచీకి 40 మందిని అనుమతిస్తారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని, కండ్ల కలక, జలుబు, దగ్గు వంటి సమస్యలు ఉన్న వారిని అనుమతించరు. స్విమ్మింగ్ డ్రస్, క్యాప్, గుల్స్‌తో రావాలి. యూపీఐ మోడ్‌లో ఫీజు చెల్లించాలి. నగదు తీసుకోరు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పీరియడ్స్ టైమ్‌లో మహిళలను అనుమతించరు. శరీరానికి క్రీములు రాసుకుని రాకూడదు. ఇలా వస్తే వారు బాత్‌రూమ్‌లో స్నానం చేసి రావాలి. విలువైన ఆభరణాలతో రాకూడదు.

సమయం.. ఫీజు వివరాలు

ప్రతి రోజూ ఉదయం 6–7 గంటలు, 7–8 గంటలు, సాయంత్రం 5–6, 6–7 గంటలు బ్యాచీలు ఉంటాయి. సాయంత్రం మహిళల కోసం ప్రత్యేకంగా 7–8 గంటలకు శిక్షణనిస్తారు. మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా కోచ్‌లు అందుబాటులో ఉన్నారు. ప్రతి సోమవారం సెలవు.

- నెలకు రూ.700. జీవిత కాల సభ్యులకు రూ.300.

స్విమ్మింగ్ పూల్ నిర్వహణ

రోజూ రెండు సార్లు స్మిమింగ్ పూల్‌ను క్లీన్‌చేస్తారు. నీటిలో క్లోరిన్ కలుపుతారు. దీని రీడింగ్ కూడా చూస్తారు. వాటర్ హార్డ్‌నెస్ కూడా చూసి ఈతకు అనుమతిస్తారు.

- బాత్‌రూమ్స్ నిర్వహణ ఆధునికంగా ఉంటుంది. నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తారు.

ప్రత్యేక శిబిరాలు

వేసవిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. ప్రతి ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎక్కువ మందికి అవకాశం ఉంటుంది. ఇప్పుడున్న బ్యాచీలకు అదనంగా ఉదయం సాయంత్రం ప్రత్యేకంగా ఒక బ్యాచీ ఉంటుంది.

ఈత పోటీలు

డెకాత్లాన్ ఆధ్వర్యంలో ఇక్కడ పోటీలు నిర్వహిస్తారు. ఇక్కడ శిక్షణ పొందిన స్విమ్మర్లలో చాలా మంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ముంబయ్‌లో త్వరలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు వీరు అర్హత సాధించారు.

అందరికీ అందుబాటులో స్విమ్మింగ్ పూల్



నగరంలోని అన్ని స్విమ్మింగ్ పూల్స్‌లో కన్నా తక్కువ రుసుం వసూలు చేస్తున్నాం. అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. మా వద్ద 850 మంది జీవితకాల సభ్యులు ఉన్నారు. ఇద్దరు సూపర్‌వైజర్స్ పర్యవేక్షిస్తారు. ప్రతి ఏడాది రెండు సార్లు పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. కృష్ణారెడ్డి, బుచ్చయ్య, దుర్గాప్రసాద్ లాంటి పెద్దలు ఏర్పరచిన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం.

– సనపల వరప్రసాద్, అధ్యక్షుడు, వైశాఖి స్పోర్ట్స్ పార్కు

రచయిత విహారితో సాహితీ గోష్టి



రచయిత విహారి దంపతులను సత్కరిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: కవి, కథా రచయిత విహారితో ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాహితీ గోష్టి జరిగింది. విశాఖ సాహితి సంస్థ అధ్యక్షులు ఆచార్య మలయవాసిని అధ్యక్షత వహించారు. రావిశాస్త్రి పురస్కారం అందుకోనున్న విహారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విహారి కథకుడిగా, విమర్శకుడిగా తెలుగు సాహిత్యానికి గొప్ప సేవలందించారని ప్రశంసించారు. సాహిత్య గోష్టిలో పలువురు అడిగిన ప్రశ్నలకు విహారి సమాధానాలు చెప్పారు. కథా రచనలో మెళకువలు, కథన శిల్పంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చారిత్రక, పౌరాణిక నవలలు రాయడంలో ఉండే ఇబ్బందులను విశ్లేషించారు. ఎవరు ఏ వాదంతో రాసిన మానవతా వాదం అన్నింటి కంటే గొప్పదని పేర్కొన్నారు. రచయిత సమాజ పోకడలను అర్థం చేసుకుని ప్రాచీన సాహిత్యాన్ని ఇప్పటి వాదాలతో పరిశీలించకూడదన్నారు. గ్రంథాలయ సంయుక్త కార్యదర్శి, రచయిత డి.వి. సూర్యారావు మాట్లాడుతూ సంప్రదాయ, అభ్యుదయ మార్గాలకు వారధిగా విహారిని అభివర్ణించారు. అనంతరం విహారి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు ద్విభాష్యం రాజేశ్వరరావు, ఆచార్య వెలమల సిమ్మన్న, జె.పి.శర్మ, కందాళ కనకమహాలక్ష్మి, శంకర్ నీలు, బులుసు సరోజిని, గ్రంథపాలకులు దుర్గారాణి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



జ్యోతి వెలిగించి యోగా పోటీలు ప్రారంభిస్తున్న శ్రీకాంత్, వెంకటరమణ


యోగా చేస్తున్న చిన్నారులు

సీతమ్మధార: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ కె.శ్రీకాంత్ అన్నారు. విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆదివారం సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరం ఆవరణలో యోగా పోటీలు నిర్వహించారు. వీటిని జాతీయ హ్యాండ్ బాల్ క్రీడాకారుడు ఎస్.వెంకటరమణతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు యోగాతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు.

విజేతలు వీరే..

8 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయసు వరకు సుమారు 400 మంది యోగా పోటీల్లో పాల్గొన్నారు.

- సబ్ జూనియర్స్ విభాగంలో బి.జయశ్రీ ప్రథమ, సిహెచ్.తేజశ్రీ ద్వితీయ, ఎం.మౌళిక తృతీయ స్థానాల్లో నిలిచారు.
- జూనియర్స్ విభాగంలో కె.వెంకట వైష్ణవి ప్రథమ, బి.వైష్ణవి ద్వితీయ, హర్షవర్ధనిశ్రీ తృతీయ స్థానాలు సాధించారు.
- సీనియర్స్ విభాగంలో ఎస్.వి.రమణ ఫస్ట్, ఎస్‌కే అబ్దుల్ ఖాదర్ సెకెండ్, డి.మహేశ్వరరావు థర్డ్ ప్లేస్‌లో నిలిచారు. పోటీల అనంతరం ఆయా విభాగాల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అతిథులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ యు.రామారావు, డాక్టర్ ఎం.రవి శ్రీనివాస్, యోగా టీచర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'జాతీయ మహిళా కమిషన్ విచారణ చేపట్టాలి'

సీతంపేట: నారాయణ విద్యా సంస్థల అధినేత, మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణపై వస్తున్న లైంగిక వేధింపుల ఆరోపణలపై జాతీయ మహిళా కమిషన్ సమగ్ర విచారణ జరిపించాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నారాయణపై ఇలాంటి సంచలన వేధింపుల ఆరోపణల కారణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని నారాయణ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న వేలాది మంది మహిళా ఉద్యోగులు, చదువుతున్న లక్షలాది మంది విద్యార్థినుల మనసులో అనేక అనుమానాలు, అపోహలకు దారితీస్తుందని పేర్కొన్నారు. ఎటువంటి రాజకీయ కక్ష సాధింపులకు తావులేకుండా విచారణ నిష్పక్షపాతంగా జరిపించి, నిజానిజాలను నిగ్గుతేల్చాలన్నారు. నారాయణ విద్యా సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యల వెనుక ఉన్న చీకటి కోణాన్ని బయటపెడతానన్న ప్రియ ప్రాణాలకు పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు.

అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: నగరంలో అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని రౌడీషీటర్లను ద్వారకా జోన్ సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు హెచ్చరించారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు రాత్రి 9 గంటలకు ఇంటి వద్ద ఉండాలని, మద్యం తాగి గొడవలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరు.. ఎక్కడ ఏం పనిచేస్తున్నారో వివరాలను తెలియజేయాలని చెప్పారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇంటి వద్ద కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. ఎస్ఐ ధరేంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యూసీసీతో మహిళలకు సమాన హక్కులు

సీతంపేట: ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) దేశానికి చాలా అవసరమని, దీనిని స్వాగతిస్తున్నామని మానవ వికాస వేదిక అధ్యక్షుడు యు.సాంబశివరావు అన్నారు. ఉమ్మడి పౌర స్మృతిపై ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు దాటినా వివిధ మతాల్లో ఉన్న ఆచారాలతో మహిళలను అణచివేయడం, వారి హక్కులకు భంగం కలిగించడం మనం చూస్తున్నామన్నారు. ఉమ్మడి పౌర స్మృతి ఉంటే ఈ సమస్యలు ఉండవని, నేడు మహిళల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోందన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశించినది లౌకికవాద ఉమ్మడి పౌర స్మృతి అని పేర్కొన్నారు. దీనికి మతాలతో సంబంధం ఉండదని, జీవితం లౌకికమైనదని. మహిళలందరికీ సమాన హక్కులు కల్పించడం అంబేడ్కర్ కోరుకున్న లౌకిక ఉమ్మడి పౌరస్మృతి ముఖ్య ఉద్దేశమని సాంబశివరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కొత్తపల్లి వెంకటరమణ, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందికరంగా పార్కింగ్


రోడ్డుకిరువైపులా పార్క్‌చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని కృష్ణ మందిరం రోడ్డుకు ఇరువైపులా కార్లు, ద్విచక్ర వాహనాలు నిలిపివేయడంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అసలే చిన్న రోడ్డు కావడంతో వాహనాల పార్కింగ్ వల్ల ఇక్కట్లకు గురవుతున్నట్లు పలువురు స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సందడి


టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల 1981–83 బ్యాచ్ విద్యార్థులు

సీతమ్మధార: వారంతా 42 ఏళ్ల తర్వాత కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుశల ప్రశ్నలు వేసుకుని సందడి చేశారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1981–83లో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు వారంతా. నగరంలోని డైమండ్ పార్కు దరి ఒక హోటల్లో ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. గోపీనాథపురం స్కూల్, కళాశాలలో చదువుకున్న పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎవరు ఏ వృత్తిలో స్థిరపడ్డారో ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. మహిళలు థింసా నృత్యం, మగవారు డ్యాన్స్ స్టెప్పులతో అదరగొట్టారు. ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ సూర్యప్రతాప్, సాలూరు మున్సిపల్ కమిషనర్ హనుమంతు శంకరరావు, కేజీహెచ్ హెడ్ నర్స్ లక్ష్మి, ఎంవీడీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ బమ్మిడి రమణి, హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన డి.రాజశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వసంతరావు, బ్యాట్మింటన్ క్రీడాకారుడు ఆర్‌వీ మోహన్ తదితరులు పాల్గొని ఆనందంగా గడిపారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


అమ్మవారికి హారతి సమర్పిస్తున్న అర్చకులు

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం అధిక శ్రావణ మాస శుద్ధ ద్వాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

కీళ్ల సమస్యలపై జాగ్రత్తలు అవసరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మురళీనగర్: కీళ్ల నొప్పులు వచ్చిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలని క్వీన్స్ ఎన్ఆర్ ఆస్పత్రి కీళ్ల వ్యాధుల నిపుణుడు డాక్టర్ పి.శరత్‌రామ్ సూచించారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఎక్కువగా కళ్లు తిరగడం, జారిపోవడం, తూలిపోవడం వల్ల కాళ్లు, చేతుల ఎముకలు, తుంటి ఎముకలు విరగటం వంటి సమస్యలు వస్తాయన్నారు. సుగర్ నియంత్రణలో ఉంచుకోవడం, కళ్ల సమస్యలకు, నరాల వ్యాధులకు సరైన చికిత్స అవసరమవుతుందని వివరించారు. మహిళల్లో ఎక్కువగా డీ–విటమిన్, కాల్షియం లోపం వల్ల నడుం నొప్పి, నీరసం వంటి సమస్యలు వస్తాయన్నారు. ప్రతి రెండు నెలలకోసారి కాల్షియం పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఫిజీషియన్ డాక్టర్ సతీష్ సీజనల్ వ్యాధులను అధిగమించడానికి అవసరమైన సలహాలిచ్చారు. కండ్ల కలక వచ్చినప్పుడు కళ్లను చేతి వేళ్లతో మాటిమాటికి తుడవకూడదని, ఆకు పసరలు వేయడం చేయకూడదన్నారు. అనంతరం శరత్‌రామ్, సతీష్‌లను వాకర్స్ క్లబ్ తరఫున ఘనంగా సత్కరించారు. ఈ శిబిరంలో 187 మందికి బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు. క్లబ్ అధ్యక్షులు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి లంకా వెంకటసుధాకర్, పూర్వాధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, ఉపాధ్యక్షులు ఆదిభట్ల రామకృష్ణ, మళ్ల డాక్టర్ సతీష్, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతా, డాక్టర్ సతీష్, కార్యవర్గ సభ్యులు వడ్డాది అప్పారావు, ఎం.ఎస్.ఆర్.మూర్తి, బి.సూర్యనారాయణ మాస్టారు శిబిరం నిర్వహణకు సహకరించారు.

గురిపెడితే.. తప్పకూడదు


ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ అధికారి

ఏయూ క్యాంపస్: దేశ రక్షణలో యువత అడుగిడాలి. భరతమాత రక్షణకు నడుంబిగించాలి. యువతీయువకులు దేశ త్రివిధ దళాలలో చేరాలి. దీనికి తొలి అడుగుగా నేషనల్ కేడెట్ కాప్స్ నిలుస్తుంది. కళాశాల స్థాయిలో విద్యార్థులను ఎన్‌సీసీలో భాగస్వాములను చేస్తూ క్రమశిక్షణ, దేశభక్తి, యుద్ధ మెలకువలు నేర్పిస్తారు. దీనిలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఏయూ అవుట్‌గేట్ వద్ద ప్రతి ఆదివారం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలా ఈ ఆదివారం కూడా విద్యార్థులకు తుపాకీల వినియోగంపై ఎన్‌సీసీ అధికారులు అవగాహన కల్పించారు. విద్యార్థులకు నమూనా తుపాకులు అందించి ప్రత్యక్షంగా శిక్షణ ఇచ్చారు.

అమ్మ ఫౌండేషన్ అన్నదానం


సాయి ధ్యాన మందిరం వద్ద పేదలకు అన్నదానం చేస్తున్న శరగడం వెంకటలక్ష్మి

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిర ఆవరణలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శరగడం వెంకటలక్ష్మి పేదలకు ఆహారం పొట్లాలు అందజేశారు. హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కన్వీనర్, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.సత్యలక్ష్మి జన్మదినం సందర్భంగా సుమారు 200 మందికి అన్నదానం చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు కనకమహాలక్ష్మి, సావిత్రి, నిర్మల, జ్యోతి, గౌరీ, సరోజిని, ఈశ్వరి, ఊర్వశి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిలో ప్రతి మొక్కకు ఓ ప్రత్యేకత


మొక్కల ప్రత్యేకతలను వివరిస్తున్న డాక్టర్ ప్రకాష్

ఏయూ క్యాంపస్: ప్రకృతిలో మనం నిత్యం చూసే ప్రతి మొక్కకు ఓ ప్రత్యేకత ఉందని ఏయూ వృక్ష శాస్త్ర విభాగ పరిశోధకుడు డాక్టర్ ప్రకాష్ అన్నారు. ఆదివారం ఉదయం విభాగంలో నిర్వహించిన మొక్కలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశీయంగా పెరిగే మొక్కలు, విదేశాల నుంచి తెచ్చి అభివృద్ధి చేసిన మొక్కలు, ఔషధ మొక్కలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విభాగంలో మ్యూజియంలో భద్రపరిచిన వివిధ మొక్కల ప్రత్యేకతలు, విశిష్టతలను ఆయన వివరించారు.

రైల్వే పార్కులు ప్రజలందరివీ..


రైల్వే పార్క్‌లో పర్యటిస్తున్న ఎంపీ జీవీఎల్

తాటిచెట్లపాలెం: రైల్వేస్టేషన్ అంటే రైల్వేది మాత్రమే కాదని ప్రజలందరిదని, రైల్వే పార్కులు కూడా కేవలం రైల్వే వాళ్ల కోసం మాత్రమే కాదని ప్రజలందరి ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసినవని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఆదివారం ఉదయం రైల్వే వాకర్స్ పార్క్‌లో ఆయన పర్యటించి వాకర్స్ సమస్యలను తెలుసుకున్నారు. రైల్వే పార్క్ గేట్ తాళాలు వేసి, పార్క్‌ను మూసివేయడంపై జీవీఎల్ స్పందించారు. తక్షణమే డీఆర్ఎంతో మాట్లాడి గేట్ తాళాలు తెరిపించడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ పార్క్‌లోని అమ్మవారి గుడికి కూడా తాళాలు వేయడం భావ్యం కాదని, ఎంపీగా, జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా రైల్వే అధికారులతో మాట్లాడి గుడిని తెరిపించేందుకు కృషి చేస్తానన్నారు.

ఆలయ చైర్మన్ ఇంట్లో అగ్నిప్రమాదం


ప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మల్కాపురం: జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలోని ఓ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం సంభవించింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. స్థానిక పైడితల్లి అమ్మవారి ఆలయ చైర్మన్, డ్యాన్స్ మాస్టర్ పక్కి సాయికుమార్ అంబేడ్కర్ కాలనీలో నివసిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విషయాన్ని వెంటనే వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు దృష్టికి తీసుకెళ్లి సాయికుమార్‌కు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

బాలసతీష్‌కు అభినందనలు


ప్రెసిడెంట్ జీఎస్ మాగోతో ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు

మల్కాపురం: మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఎన్నికల్లో విశాఖ నుంచి జాతీయ ఉపాధ్యక్షుడిగా కౌన్సిల్ మెంబర్ సి.బాలసతీష్ గెలుపొందారు. ఈ మేరకు 2023–25 గాను ఈ నెల 26న ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో ఆయన అధిక శాతం మెజారిటీ సాధించారు. ఎంఈఎస్ చైర్మన్ గుజ్జు వెంకటరెడ్డి, సెక్రటరీ బి.వి.ఎస్.సుబ్బరాజు, కౌన్సిల్ సభ్యులు ఎస్.అప్పారావు, వి.రామకృష్ణరాజు, సిహెచ్.సుదర్శన్, సిహెచ్.మంగపతిరావు, బి.రమేష్‌రెడ్డి, వైస్ చైర్మన్లు ఎన్.రాజశేఖర్, ఎం.వి.రమణ, పి.నారాయణరావు, జాయింట్ సెక్రటరీలు ఎ.అనంతరాజు, జి.శంకర్‌రెడ్డి, బి.వేణుగోపాలరావు, ట్రెజరర్ డి.ఇ.వి.రామప్రసాద్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు ఎం.పనికారరావు, ఎం.పి.శ్రీనివాసరావు, బి.ఎస్.రాజారెడ్డి ఎన్నికల్లో పాల్గొన్నారు. అనంతరం విశాఖకు వచ్చిన బాలసతీష్‌కు ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ విశాఖపట్నం సభ్యులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

సత్యానగర్–1 సమస్యల పరిష్కారానికి చర్యలు


మాట్లాడుతున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు సత్యానగర్–1 ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు తెలిపారు. 280 సచివాలయం పరిధిలోని సత్యానగర్–1 రామంజనేయ సేవా మండలిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. దశాబ్దాల కాలంగా శిథిలావస్థలో ఉన్న రహదారిని నూతన బీటీ రోడ్డుగా నిర్మించడమే కాకుండా ఒక వైపు కాలువల నిర్మాణం పూర్తి చేసినట్లు చెప్పారు. రహదారి రెండో వైపు కాలనీ నిర్మాణానికి అంచనాలు రూపొందించి టెండర్లు పిలిచామన్నారు. ఈ కాలనీలో విద్యుత్ సంబంధించిన లో వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి నూతనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని, కేబుల్ కొరత కారణంగా పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సామాజిక భవనాన్ని ప్రజల అవసరార్థం వార్డు సచివాలయానికి తీసుకున్నందున ఫస్ట్ ఫ్లోర్‌లో నిర్మాణానికి అంచనాలు రూపొందించి అది పూర్తికాగానే సామాజిక అవసరాలకు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో గృహసారథులు, విశాఖ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐ.రవికుమార్, వార్డు శివాలయ బోర్డు చైర్మన్, గ్రామ అధ్యక్షులు ఎస్.వి.రమణ, వార్డు సీనియర్ నాయకులు జె.వెంకట రావు, ఆర్.చంద్రమౌళి, బి.శివరామ ప్రసాద్, బి.శంకర్, కె.మున్నా, కె.కిషోర్, మహిళా నాయకులు ఆర్.వరలక్ష్మి, ఎం.లక్ష్మి, ఎ.లక్ష్మి పాల్గొన్నారు.

లలితా పీఠంలో ముగిసిన ప్రవచనాలు


ప్రవచిస్తున్న మాతా రమ్యానంద భారతి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో వారం రోజులుగా జరుగుతున్న శ్రీలలితా లహరి సప్తాహ ప్రవచన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. శ్రీశక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని చివరి రోజు ప్రవచనంలో భండాసురుని సంహారానికి లలితాదేవి అమ్మవారు చేసిన యుద్ధ ఘట్టాన్ని భక్తులకు కళ్లకు కట్టినట్టు వివరించారు. భండాసురుడు ప్రయోగించిన మహాసుర అస్త్రం, అమ్మవారి వేదశక్తిని నశింప జేసేలా ప్రయోగించిన సోమకాసుర అస్త్రం, హిరణ్యాక్ష అస్త్రం గురించి ప్రవచించారు. మత్స్య, కూర్మావతారాలతో ఈ అస్త్రాలను అమ్మవారు ఎదుర్కొన్న తీరును వివరించారు. లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ప్రవచన కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.